సాక్షి శ్రీకాకుళం

శనివారం । 23 । ఆగస్టు । 2025

ప్రయాణం బస్‌తీ మే సవాలే



శ్రావణ శుక్రవారం రోజున కొత్తూరు నుంచి బత్తిలి వెళ్లే బస్సు వద్ద గందరగోళం చోటు చేసుకుంది. బస్సుల్లో ప్రయాణం ఉచితమే అయినా అవసరమైనన్ని సర్వీసులు లేకపోవడంతో మహిళలు ఉసూరుమన్నారు. బస్సులో కూర్చునేందుకు వీల్లేకపోవడంతో ప్రత్యామ్నాయాలు చూసుకున్నారు. - కొత్తూరు

మండపాలకు చలానాలు అక్కర్లేదు

శ్రీకాకుళం క్రైమ్: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే వినాయకుని మండపాల ఏర్పాటుకు ఎలాంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్‌లో అనుమతులు పొందితే చాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం స్పష్టం చేశారు. ఉత్సవాలు నిర్వహించేవారు ముందుగా కమిటీగా ఏర్పడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానంతో హెచ్‌టీటీపీఎస్:జిఎఎస్‌ఇఎస్ హెచ్‌యుటిఎస్‌ఎవి.ఎన్‌ఐటి వెబ్‌సైట్‌లో అనుమతులు పొందాలన్నారు.

న్యూస్‌రీల్

ఉద్యోగాలు తొలగిస్తే ఎలా బతికేది..?



ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఇచ్ఛాపురం రూరల్: గత 27 ఏళ్లుగా పని చేస్తున్న సంస్థలో అర్ధంతరంగా తమను తొలగిస్తే కుటుంబాలతో ఎలా బతికేది అంటూ ఆర్‌డబ్ల్యూఎస్ పంప్ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని ఉద్దానం మంచినీటి పథకం, ఆర్‌డబ్ల్యూఎస్ పథకంలో పనిచేస్తున్న 132 మంది కార్మికులను ఇటీవల మెగా వాటర్ ప్రాజెక్ట్ సంస్థ విధుల నుంచి తొలగించింది. దీంతో వీరంతా శుక్రవారం ఇచ్ఛాపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తమను విధుల్లోకి తీసుకోవాలని మెగా సంస్థను, ప్రభుత్వాన్ని కోరారు.

నల్లబ్యాడ్జీలతో అటవీ శాఖ సిబ్బంది నిరసన



పాతపట్నం ఫారెస్ట్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అటవీశాఖ ఉద్యోగులు

పాతపట్నం: పాతపట్నం అటవీ శాఖ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. స్థానిక అంతరాబ ఫారెస్ట్ కార్యాలయం వద్ద శుక్రవారం నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎల్.యతీశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన శ్రీశైలం శిఖరం చెక్‌పోస్ట్ వద్ద శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, అతని అనుచరులు విచక్షణా రహితంగా విధుల్లో ఉన్న అటవీశాఖ అధికారులపై దాడి చేశారన్నారు. ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, అతని అనుచరులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. దాడిని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు.

'యూరియాను బ్లాక్ మార్కెట్ చేయడం నేరం'

శ్రీకాకుళం క్రైమ్ : యూరియా ఎవరైనా అక్రమంగా దాచి పెట్టినా.. బ్లాక్ మార్కెటింగ్ చేసినా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం శనివారం నుంచి ప్రత్యేక దాడులు నిర్వహిస్తుందని జిల్లాలోని ఆ విభాగం నుంచి ప్రత్యేక ప్రకటన జారీ అయ్యింది. ఈ మేరకు శుక్రవారం డైరెక్టర్ జనరల్ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులిచ్చారని ప్రకటనలో పేర్కొన్నారు. యూరియాను దాచడం, బ్లాక్‌మార్కెట్‌కు పాల్పడటం చట్ట విరుద్ధమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గోదాములు, హోల్‌సేల్ డీలర్లు, రీటైల్ షాపులపై తమ బృందాలతో పాటు రెవెన్యూ, అగ్రికల్చర్ రంగాలు తనిఖీలు నిర్వహిస్తాయని, అక్రమ నిల్వ లేదా దారి మళ్లింపు వంటి సమాచారం తెలిసినవారు సమీప విజిలెన్స్ కార్యాలయానికి తెలియజేయాలని ఈ ప్రకటనలో కోరారు.

పర్మిట్ దెబ్బ.. బార్‌లు అబ్బా.!



- బార్‌ల ఏర్పాటుకు స్పందన కరువు
- గడువు సమీపిస్తున్నా దరఖాస్తు చేయని వ్యాపారులు
- గిట్టుబాటు కాదని వెనక్కి తగ్గుతున్న పరిస్థితి
- 19 బార్‌లకు గాను ఒక్క దరఖాస్తు కూడా పడని వైనం
- ఎక్సైజ్ శాఖలో మల్లగుల్లాలు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

మద్యం షాపుల కోసం పెద్ద ఎత్తున పోటీ పడ్డ వ్యాపారులు బార్‌ల విషయానికొస్తే వెనక్కి తగ్గిపోయారు. వైన్ షాపులకు పర్మిట్ రూమ్‌లు ఇవ్వడంతో వాటిని తట్టుకుని బార్‌లు నడపడం ఆషామాషీ కాదని వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో జిల్లాలో 19 బార్‌లకు నోటిఫికేషన్ ఇస్తే ఇంతవరకు ఒక్క దరఖాస్తు కూడా పడలేదు. జీరో మార్జిన్, భారీగా దరఖాస్తు, లైసెన్సు ఫీజు ఉండటంతో నష్టాలు వస్తాయని వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో ఎక్సైజ్ అధికారులకు అవస్థలు తప్పడం లేదు. దరఖాస్తు చేయండి మహాప్రభో అని వ్యాపారులను వేడుకుంటున్నారు.

గుదిబండగా మారిన పర్మిట్ రూమ్‌లు



మద్యం ఆదాయమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పెట్టుకుంది. జిల్లాలో ఎక్కడపడితే అక్కడ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. వాటికి అనుబంధంగా బెల్ట్‌షాపులను ప్రోత్సహించింది. తాజాగా పర్మిట్ రూమ్‌లకు అవకాశం ఇచ్చింది. ప్రతి మద్యం షాపు యజమాని తప్పనిసరిగా పర్మిట్ రూమ్ పెట్టుకోవాల్సిందే అని ఆంక్షలు పెట్టింది. లేదంటే ఆ పర్మిట్ రూమ్‌కు సంబంధించిన ఫీజు కట్టాల్సిందేనని షరతు పెట్టింది. దీంతో తప్పని పరిస్థితుల్లో వైన్‌షాపులన్నీ పర్మిట్ రూమ్‌లు పెట్టుకోక తప్పడం లేదు. ఒక్కో పర్మిట్ రూమ్‌కు రూ.7.50లక్షలు వసూలు చేస్తోంది. అక్టోబర్ నుంచి సెప్టెంబర్ వరకు కాల వ్యవధి నిర్దేశించింది. ఈ రెండు నెలలకు గాను రూ.1.25 లక్షలు అదనంగా చెల్లింపులు చేయాలని ఒత్తిడికి దిగింది. దీంతో మద్యం వ్యాపారులు ఆ స్థాయిలో రుసుము చెల్లించడానికి తొలుత తటపటాయించినా తప్పని పరిస్థితుల్లో చెల్లింపులు చేస్తున్నారు. మద్యం వ్యాపారం అలవాటుగా మారిపోవడంతో వ్యసనం మాదిరి పర్మిట్ రూమ్‌లకు అదనపు చెల్లింపులు చేస్తున్నారు. కొందరైతే వస్తున్న నష్టాల దృష్ట్యా షాపులు మూసేయాలన్న ఆలోచనకొచ్చేశారు. కొన్నాళ్లు పరిస్థితిని గమనించి ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ముందుకు రాని వ్యాపారులు...

జిల్లాలో 19 బార్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. వీటిలో 17బార్‌లకు ఈ నెల 26వ తేదీ వరకు, మరో 2 బార్‌లకు 29వ తేదీవరకు గడువు ఇచ్చింది. అయితే, ఇంతవరకు ఒక్క బార్‌కు కూడా దరఖాస్తు పడలేదు. దీనికంతటికీ ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు, బార్‌ల సెటప్పే కారణంగా తెలుస్తోంది. తెలంగాణలో లైఫ్ టైమ్ బార్ అనుమతికి రూ.లక్ష దరఖాస్తు ఫీజు కాగా, ఇక్కడ మూడేళ్లకు రూ.5లక్షల ఫీజు నిర్దేశించింది. దానికి తోడు సంవత్సరానికి లైసెన్సు ఫీజు కింద శ్రీకాకుళం, పలాసలో రూ. 55 లక్షలు, ఆమదాలవలస, ఇచ్ఛాపురంలో రూ. 35లక్షలు ఫిక్స్ చేసింది. అదేవిధంగా ప్రాసెసింగ్ ఫీజు కింద మరో రూ.10లక్షలు నిర్దేశించింది. ఇవన్నీ చెల్లించి నడపాలంటే బార్‌ల ద్వారా భారీగా ఆదాయం రావాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం జీరో మార్జిన్ పెట్టింది. ఫలితంగా లాభాలు వచ్చే అవకాశం లేదన్న ఉద్దేశంతో వ్యాపారులు ముందుకు రావడం లేదు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరినా ఇంతవరకు ఒక్క దరఖాస్తు వేయలేదు.

పర్మిట్ రూమ్‌లుండగా..



దాదాపు ప్రతి మద్యం షాపు వద్ద పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వమే నిర్ణయించింది. దీంతో బార్‌ల మాదిరిగా రాత్రి 10 గంటల వరకు ఆ పర్మిట్ రూమ్‌ల వద్దే కూర్చొని తాగవచ్చు. అక్కడే మందు, ముక్క దొరికినప్పుడు ఇంకా బార్‌లకు వెళ్లాల్సిన అవసరం ఏముంటుందని వ్యాపారులు భావిస్తున్నారు. ప్రభుత్వం చెప్పిన డిజైన్‌లో బార్‌లను ఏర్పాటు చేస్తే ఎక్కువ వడ్డించి విక్రయిస్తే తప్ప వర్కవుట్ కాదు. వివిధ శాఖల అధికారులకు ముడుపులు అదనం. కానీ ప్రభుత్వమే జీరో మార్జిన్ అని ప్రకటించింది. ఈ లెక్కన ఎక్కువ వడ్డించి విక్రయించాలి. అలా చేస్తే పర్మిట్ రూమ్‌ల వద్ద కన్నా ధర ఎక్కువ పడుతుంది. దీంతో మందుబాబులు బార్‌లకు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని బార్‌లకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు.

దరఖాస్తులు ఎలా వేయించాలబ్బా..!

రోజులు గడుస్తున్నా బార్‌లకు దరఖాస్తులు పడకపోవడంతో ఎక్సైజ్ అధికారులు వ్యాపారుల వెంట పడుతున్నారు. ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించడంతో తప్పని పరిస్థితుల్లో ఎక్సైజ్ అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సి వస్తోంది. ఎలాగైనా దరఖాస్తులు వేయించేలా వ్యాపారులను రిక్వెస్టు చేస్తున్నారు. కానీ, ఇంతవరకు వ్యాపారులు స్పందిస్తున్న దాఖలాలు కన్పించడం లేదు. కనీసం ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు పడితేనే డ్రా తీస్తారు. లేదంటే మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాల్సిందే. ఈ పరిస్థితుల్లో బార్‌లకు దరఖాస్తులు ఎలా వేయించాలన్న పనిలో ఎక్సైజ్ అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ఏమైనా సడలింపులు ఇస్తే ఆలోచిద్దామనే ధోరణిలో వ్యాపారులంతా ఉన్నారు. ఇప్పటికే బార్‌లు నడుపుతున్న వారు కూడా నేటికీ దరఖాస్తు చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

శ్రావణ శోభితం

అభిషేకం.. అలంకారం.. అర్చన



శ్రీకాకుళం కల్చరల్: అలంకరణలో సంతోషిమాత



సోంపేట: సంతాన లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన సోమపోలమాంబ దేవి



ఎచ్చెర్ల: కుంచాలకూర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో అమ్మవారికి అభిషేకాలను నిర్వహిస్తున్న పీఠాధిపతి బాలభాస్కర శర్మ

ఆరారా అభిషేకాలు, అపురూపంగా అలంకరణలు, వైభవంగా అర్చనలు.. కలగలిపి శ్రావణ శుక్రవారం పూట అమ్మవారి ఆలయాలు కళకళలాడాయి. మహిళలు వ్రతాలు పాటించడంతో కోవెల ప్రాంగణాల్లో గాజుల చప్పుళ్లు వీనులవిందుగా వినిపించాయి. సత్సంప్రదాయ రీతుల్లో వ్రతాలు జరిగాయి.

మల్లన్నకు పసుపు లేపనం



శ్రావణ మాసం సందర్భంగా టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామికి పసుపు లేపనంలో ప్రత్యేక పూజలు చేశారు. లోక కల్యాణార్థం స్వామికి పసుపు లేపనంతో పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులంతా అభిషేకాలు చేశారు. -టెక్కలి

ఎరువుల సమస్య ఉంటే కాల్ చేయండి

- 91218 63788 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీపై పర్యవేక్షణ కోసం 9121863788 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు జిల్లాలో వరి, ఇతర పంటలు కలిపి సుమారు 3,73,000 ఎకరాల్లో సాగు జరుగుతోందన్నారు. దీనికి గాను 17 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని అంచనా వేసినా, ఇప్పటివరకు రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 10,244 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల ద్వారా 11,400 మెట్రిక్ టన్నులు, మొత్తంగా 21 వేల మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా చేశామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాల వద్ద 218.86 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 261 మెట్రిక్ టన్నులు, బఫర్‌లో 552 మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 1,031.86 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. అదనంగా మరో 3,200 మెట్రిక్ టన్నులు వారం రోజుల్లో జిల్లాకు చేరుకుంటాయని కలెక్టర్ వెల్లడించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎరువుల నిల్వపై రోజువారీగా పర్యవేక్షణ జరుగుతోందని, రెవెన్యూ, విజిలెన్స్ విభాగాల సహకారంతో తనిఖీలు కూడా చేపడుతున్నామని ఆయన తెలిపారు. శాస్త్రవేత్తల సూచనలు పాటించి అవసరమైన మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలని సూచించారు. నానో ఎరువులు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని, అర లీటర్ ధర రూ.220 మాత్రమేనని, ఇది ఒక బస్తా యూరియాకు సమానమని, డ్రోన్ల ద్వారా పిచికారి చేయడం ద్వారా రైతులు మెరుగైన లాభాలు పొందవచ్చని వివరించారు. ఎవరైనా ఎరువులు అక్రమంగా నిల్వ చేసినట్లు తెలిస్తే వెంటనే కంట్రోల్ రూమ్ నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు.

అవినీతికి పాల్పడితే వేటు తప్పదు



నేరసమీక్షలో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి. చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తదితరులు

- అర్ధవార్షిక నేర సమీక్షలో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

అరసవల్లి: జిల్లాలో పోలీస్ శాఖలో చాలా మంది అధికారులపై అవినీతిపై ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై వేటు తప్పదని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి హెచ్చరించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్షలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానాతో పాటు ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి సమక్షంలో జరిగిన ఈ సమీక్షలో జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు, దర్యాప్తు జరుగుతున్న తీరుతెన్నులపై ఆయన ఆరా తీశారు. జిల్లాలో దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ గంజాయి కేసులు, సైబర్ మోసాలు నమోదవుతున్నాయని, నియంత్రణకు నిఘా చర్యలు చేపట్టాలన్నారు. స్టేషన్లకు వచ్చిన బాధితులతో మర్యాదపూర్వకంగా మాట్లాడేలా సిబ్బంది వ్యవహరించాలన్నారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణకు రాత్రి వేళల్లో గస్తీలు పెంచాలని సూచించారు.

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ జిల్లాలో నేరాల సంఖ్యను నియంత్రించేలా శాఖాధికారులు శ్రద్ధ వహించాలని, అలాగే పాఠశాలల్లో, వసతి గృహాల్లో ప్రతి శనివారం విద్యార్థులతో పోలీసులు మమేకమై గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగించేలా కార్యక్రమాలను చేపట్టాలన్నారు.
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి అహ్మద్ మౌలానా మాట్లాడుతూ కొత్తగా వచ్చిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కేసుల దర్యాప్తుల్లో ఎదురయ్యే లీగల్ సమస్యలు, నేరప్రవృత్తి, నేర తరహా వంటి పలు అంశాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో చర్చించాలని సూచించారు.
- ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో చాలావరకు నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. జిల్లాలో విజిబుల్ పోలీసింగ్, నైట్ పోలీసింగ్, ట్రాఫిక్ నియంత్రణకు కూడా పక్కా చర్యలు చేపట్టడంతో శాఖాపరంగా పురోగతి సాధించామన్నారు.



మొదట సరదాగానే మొదలవుతుంది. కొన్నాళ్లకు అలవాటుగా మారుతుంది. అలవాటు కాస్తా వ్యసనమైపోతుంది. ఆ వ్యసనమే మనిషిని బానిసగా మార్చేసి ప్రాణాలు సైతం బలికొంటుంది. ఆన్‌లైన్ బెట్టింగ్ అత్యంత ప్రమాదకారి. జిల్లాలోనూ ఈ మహమ్మారి బారిన పడి యువత ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండడమే వారి తప్పైపోయింది. ఈ జాడ్యాన్ని వదిలించేందుకు కేంద్రం లోక్‌సభలో ఇటీవలే ఆన్‌లైన్ బెట్టింగ్ నేరమనే బిల్లుకు ఆమోదం తెలిపింది. బిల్లుతో పాటు ఈ జాడ్యాన్ని వదిలించే విరుగుడు కూడా కనిబెట్టాల్సిందే.



విరుగుడు కని బెట్‌టాల్సిందే..!

- ఆన్‌లైన్ బెట్టింగ్ నేరంగా లోకసభలో బిల్లు
- జిల్లాలోనూ కనిపిస్తున్న జాడ్యం
- వ్యసనం వదిలించుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం

శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లాలో ఆన్‌లైన్ బెట్టింగ్‌రాయుళ్లు పెరిగిపోతున్నారు. ఇంటి పరిస్థితులు గమనించకుండా, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులపై ఏమాత్రం అవగాహన లేకుండా ఇష్టానుసారం పందాలు కాస్తున్నారు. లక్షలకు లక్షలు అప్పు చేసి నిండా మునిగిపోయి ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. ఈ ఏడాది మేలో జిల్లా కేంద్రంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి పర్యవేక్షణలోని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బెట్టింగ్ మాఫియా గుట్టు రట్టు చేశారు. శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల పోలీసులు సుమారు ఎనిమిది నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. ఇదే కేసులో మరో 15 మంది ఆడినవారిని (బాధితులు) సాక్షులుగా మార్చారు. న్యాయమూర్తి ఒక్కరోజు రిమాండ్ విధించి బెయిల్ ఇవ్వడంతో వారంతా బయటకు వచ్చేశారు. నేరం రుజువైతే వీరికి దాదాపు ఒక నెల నుంచి ఆరునెలల్లోపు జైలు శిక్ష పడే వీలుంది. లేదంటే మొదటిసారి పట్టుబడితే రూ .500 జరిమానాతో బయటపడతారు. మళ్లీ మళ్లీ పట్టుబడితే రూ. 1 వేయి నుంచి రూ. 3 వేల వరకు పెంచుకుంటూ పోతారు. కానీ తాజాగా లోక్‌సభలో ఓ బిల్లు ఆమోదం పొందింది. ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు -2025 ఆచరణలోకి వచ్చిందంటే ఇక ఈ ఆటలు కుదరవు. నిర్వాహకులకు, నగదు లావాదేవీలు జరిపే బ్యాంకులకు, బుకీలకు, ప్రమోటర్లకు నేరంలో వారి పాత్ర, ప్రాధాన్యత అనుసరించి రెండేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్షతోపాటు రూ. 50 లక్షల నుంచి రూ. 2 కోట్ల భారీ జరిమానా కూడా విధించే అవకాశం ఉంది.



జిల్లాలో బెట్టింగ్ భూతం



- గత నెల 16న హిరమండలంలో ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్స్‌లో నష్టపోయి ఆత్మహత్య చేసుకున్నాడు.
- శ్రీకాకుళం గారవీధిలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బెట్టింగ్ ఆడి రూ. కోటి పోగొట్టుకుని తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- మార్చిలో పలాస డివిజన్ పరిధిలో ఓ యువకుడు ఆన్‌లైన్‌లో అప్పులు వాడి అవి తీర్చలేక సూసైడ్ నోట్ రాసి మరీ చనిపోయాడు. అతడు మూడేళ్లుగా లోన్ యాప్‌లు వాడుతూ టార్చర్ భరించలేకపోయాడు.
- ఈ ఏడాది ఏప్రిల్‌లో సారవకోటకు చెందిన ఇద్దరు సోదరులు ఒకరికి తెలియకుండా మరొకరు బెట్టింగ్ ఉచ్చులో చిక్కుకుని రూ. లక్షల్లో మోసపోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వీరిలో ఒకరు మృతిచెందారు.
- జలుమూరు మండలంలో ఓ రాజకీయ వేత్త క్రికెట్ బెట్టింగ్ కాస్తూ అధిక వడ్డీలకు అప్పులపాలై దాదాపు రూ. 7 కోట్ల వరకు ఐపీలు పెట్టి పరారయ్యాడు. ఆరునెలలకు గానీ తిరిగి రాలేదు.

కేంద్రం బిల్లు ఆచరణలోకి వస్తే..



- ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌తో పాటు ఆన్‌లైన్ ఫ్యాంటసీ స్పోర్ట్స్, ఆన్‌లైన్ లాటరీలు నిషేధం. డబ్బులు పెట్టి ఆన్‌లైన్‌లో ఆడే క్రీడలపై నిషేధం అమలవుతుంది.
- ఆన్‌లైన్ గేమ్‌లను ప్రచారం చేసే వారూ నేరస్తులవుతారు. గేమ్‌లో భాగంగా ఒకరి నుంచి మరొకరికి ఆన్‌లైన్‌లో నగదు బదిలీలకు వీలు కల్పించే బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలను శిక్షిస్తారు.
- ఏ రూపంలో బెట్టింగ్‌లు నిర్వహించినా, ప్రోత్సహించినా, ప్రచారం చేసినా నేరమే. అంటే కంప్యూటర్ లేదా మొబైల్ ఫోన్ ద్వారా చేసినా, సోషల్ మీడియా లేదా పత్రికలు లేదా టీవీల్లో ప్రచారం చేసినా శిక్ష తప్పదు.
- గేమ్‌ల్లో పాల్గొన్నవారిని (ఆడేవారిని) దోషులుగా కాకుండా బాధితులుగానే పరిగణిస్తారు.

శిక్షలు ఇవే..

- నిర్వాహకులకు మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా రూ. కోటి జరిమానా చెల్లించాలి. కొన్నిసార్లు ఈ రెండు శిక్షలూ అనుభవించాలి.
- మనీ గేమ్‌లను ప్రచారం చేస్తే (ప్రమోటర్లకు) రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ. 50 లక్షలు జరిమానా ఉంటుంది. ఈ రెండూ విధించే సందర్భాలూ ఉంటాయి.
- నగదు బదిలీలకు సహకరిస్తే మూడేళ్ల జైలు లేదా రూ. కోటి జరిమానా తప్పదు. కొన్ని సందర్భాల్లో రెండింటికీ ఆస్కారముంది.
- నిర్వాహకులు మళ్లీ మళ్లీ పట్టుబడితే 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ. 2 కోట్ల వరకు జరిమానా కట్టాల్సిందే.
- నిందితులపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు తప్పవు. వారెంట్ లేకుండానే అరెస్టు చేసి పోలీసులు విచారించవచ్చు.



అందరి భాగస్వామ్యం ఉండాలి



పెను ప్రమాదంలా పరిణమించిన ఆన్‌లైన్ బెట్టింగ్‌ను అరికట్టడం సవాల్‌తో కూడుకున్న వ్యవహారమే. పోలీసులతో పాటు అన్నివర్గాల ప్రజలు ఓ యజ్ఞంలా భావించి భాగస్వాములై అరికట్టాలి. ఆన్‌లైన్ గేమింగ్‌ను నేరంగా భావించి, భారీ జరిమానాలు, శిక్షలతో రూపొందించేలా లోక్‌సభలో బిల్లును ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం.

– డాక్టర్ ఎం.ప్రదీప్, హెచ్‌ఓడీ బయోటెక్నాలజీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీకళాశాల, శ్రీకాకుళం

ఉక్కుపాదం మోపాం..



జిల్లాలో ఎస్పీ పర్యవేక్షణలో ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం మోపాం. మేలో జరిగిన ఓ కేసులో 8 మందిని గుర్తించి, 15 మందిని సాక్షులుగా చేర్చాం. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025 ప్రవేశపెట్టడం హర్షించదగ్గ విషయం.

– సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

25న దివ్యాంగుల క్రికెట్ జట్టు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: డిఫరెంట్లీ అబ్లేడ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న దివ్యాంగుల జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు జరుగుతాయని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానంలోని జిల్లా క్రికెట్ సంఘం క్రికెట్ నెట్స్‌లో ఉదయం 9 నుంచి ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా జట్టును సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు జరిగే నార్త్‌జోన్ క్రికెట్ టోర్నీకి పంపిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన దివ్యాంగ క్రికెట్ క్రీడాకారులు వైట్ డ్రెస్, షూతో ఎంపికల్లో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు బగ్గు రామకృష్ణ (99127 48359)ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

'మాతా శిశు మరణాలు తగ్గించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మాతా,శిశు మరణాల రేటును గణనీయంగా తగ్గించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు జరిగేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మాకివలస, గుత్తావిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన మాతా మరణాలతో పాటు, చొర్లంగి, గోవిందపురం, నిమ్మాడ, బైదిలాపురం కేంద్రాల్లో చోటుచేసుకున్న శిశు మరణాలపై ఆయన ఆరా తీశారు. మరణాలకు దారితీసిన ప్రాథమిక వైద్య కారణాలపై చర్చించారు. గర్భిణులకు మొదటి త్రైమాసికం నుంచే హిమోగ్లోబిన్, బీపీ, ఇతర ఆరోగ్య పరీక్షలు, ల్యాబ్ టెస్టులు తప్పనిసరిగా చేయాలని కలెక్టర్ సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆస్పత్రులపై ప్రత్యేక నిఘా పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది పనివేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ అనిత, డీపీహెచ్ఎన్ శైలజ, డీఐఓ రామదాస్, డెమో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థుల్లో తపాలా స్టాంపుల సేకరణ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు 2017లో ప్రవేశపెట్టిన దీన్‌దయాల్ స్పర్శ యోజన ఫిలాటెలి స్కాలర్‌షిప్ పథకం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా తపాలాశాఖ సూపరింటెండెంట్ వి.హరిబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులంతా అర్హులేనని, సంబంధిత పాఠశాలలో పిలాటెలి క్లబ్ అకౌంట్ ఉండాలన్నారు. లేనిపక్షంలో ప్రధాన తపాలా కార్యాలయాన్ని సంప్రదించి పిలాటెలి ఖాతా తెరవాలన్నారు. దరఖాస్తులను సెప్టెంబరు 16 లోగా పోస్ట్‌మాస్టర్ జనరల్, ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం-530017 చిరునామాకు పంపించాలని సూచించారు.

రేపు మహిళా సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు



సాఫ్ట్‌బాల్ గేమ్ సాధనలో క్రీడాకారిణులు

శ్రీకాకుళం న్యూకాలనీ: గత కొన్నాళ్లగా శిక్షణ పొందుతున్న మహిళా సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణిలకు శుభవార్త. జిల్లా సీనియర్స్ మహిళల సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 24న శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఎంపికల ప్రక్రియను చేపట్టనున్నామని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కూన రవికుమార్, ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు తెలిపారు ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను జిల్లా ప్రాబబుల్స్ జట్లకు ఎంపిక చేసి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తామని, శిక్షణా శిబిరాల్లో రాణించిన క్రీడాకారులను జిల్లా తుది జట్లకు ఎంపిక చేస్తామని తెలిపారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాల వేదికగా ఆగస్ట్ 30, 31 తేదీల్లో ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్-2025 పోటీలు జరగనున్నాయని, జిల్లా నుంచి ఎంపికచేసిన క్రీడాకారులను రాష్ట్రపోటీలకు పంపిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలు కేఆర్ స్టేడియంలో సాఫ్ట్‌బాల్ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీ రమణకు రిపోర్ట్ చేయాలని, పూర్తి వివరాలకు 94410 11391 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

25న జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్-17 బాలబాలికల ఫెన్సింగ్ పోటీలను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్టు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్‌కుమార్ (రాజా) అన్నారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్ హాల్ వేదికగా ఉదయం 9 గంటలకు పోటీలు మొదలవుతాయని చెప్పారు. జనవరి 1, 2009 నుంచి డిసెంబరు 31, 2012 మధ్య జన్మించి, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారు మాత్రమే అర్హులని స్పష్టంచేశారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపు కార్డు ఉండాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిస్తే రాష్ట్రపోటీలకు ఎంపికచేస్తామని తెలిపారు. ఈ నెల 30న పశ్చిమగోదావరిలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. పూర్తి వివరాలకు కోచ్ జోగిపాటి వంశీ (సెల్: 76608 74844)ని సంప్రదించాలని ఆయన కోరారు.

ఆరు బయటే ఇంజెక్షన్లు

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది నిర్వాకం విస్తుగొలుపుతోంది. రోగులకు ఇంజెక్షన్ ఇవ్వాల్సి వచ్చినప్పుడు పురుషులకు, మహిళలను ప్రత్యేక గదుల్లో ఉంచి బెంచీ మీద కూర్చోబెట్టి, లేదంటే మంచం మీద పడుకోబెట్టి ఇంజెక్షన్ వేయాల్సి ఉంటుంది. ఈ ఆస్పత్రిలో పురుషులు, మహిళలకు ఒకేచోట ఇంజెక్షన్ వేస్తున్నారు. ఆరు బయట చేస్తుండడంపై మహిళలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పురుషులకు, మహిళలకు వేర్వేరుగా గదులు ఏర్పాటు చేసి ఇంజెక్షన్లు వేయించాలని పలువురు కోరుతున్నారు.

మడపాం పేపర్ మిల్లులో ప్రమాదం

● కార్మికుడు దుర్మరణం



వాసుదేవరావు మృతదేహం

నరసన్నపేట: మండలంలోని మడపాంలో వంశధార పేపరు మిల్లులో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఉంగటి వాసుదేవరావు (46) మృతి చెందాడు. కన్వేయర్ వద్ద ఊక మిషన్‌లో కూరుకుపోవడంతో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. వాసుదేవరావు 12 ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నాడు. భార్య విజయలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, ప్రమాదం జరిగిన తరువాత మిల్లు యాజమాన్యం, కుటుంబ సభ్యులు విషయాన్ని గోప్యంగా ఉంచారు. రాజీ కుదరకపోవడంతో విషయం వెలుగుచూసింది. యాజమాన్యం నిర్లక్ష్యమే ఘటనకు కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28న విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ



సమావేశంలో మాట్లాడుతున్న తులసీదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినం పేరిట ఈ నెల 28న ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.తులసీదాసు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండని యువగళం పాదయాత్రలో లోకేష్ పిలుపునిచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం మోసం కాదా అని ప్రశ్నించారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే కుట్రలో భాగంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ ఎరువులు అందక జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించి నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటీడీఏ లేకపోవడంతో గిరిజన భూములను గిరిజనేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమించుకుంటున్నారని విమర్శించారు. కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం, పి.తేజేశ్వరరావు, ఎస్.షణ్ముఖరావు, సీహెచ్.అమ్మన్నాయుడు, ఎస్.లక్ష్మీనారాయణ, పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటెప్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్



విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న వర్సిటీ సిబ్బంది

ఎచ్చెర్ల : నాలుగేళ్ల సమీకృత విద్యా కార్యక్రమం (ఐటెప్) కోర్సుల్లో ప్రవేశాలకు శుక్రవారం ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.విశ్వవిద్యాలయంలో కౌన్సెలింగ్ ప్రారంభించారు. మొత్తం 110 సీట్లకు గాను బీఎస్సీ బీఈడీ, కేటగిరీలో 53 సీట్లు, బీఏ బీఈడీలో 27 సీట్లు భర్తీ అయ్యాయి. వర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనురాధ పర్యవేక్షణలో అకడమిక్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.స్వప్నవాహిణి, విద్యావిభాగం సమన్వయకర్త డాక్టర్ జి.ఎల్.సంధ్యారాణి విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు. శనివారం కూడా కౌన్సెలింగ్ కొనసాగనుంది.

27 నుంచి సాహిత్య గణపతి ప్రవచనాలు

శ్రీకాకుళం కల్చరల్: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక ఉపనిషన్మందిరంలో ఈ నెల 27 నుంచి సెప్టెంబరు 6 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు సాహిత్య గణపతి ప్రవచనాలు జరుగుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 27న శమంతకోపాఖ్యనంపై భాస్కరభట్ల శ్రీరామశర్మ, 28న హంపీ క్షేత్రం-కొడాలి వర్ణనా వైశిష్ట్యంపై పైడి హరనాథరావు, 29న శతక రచనా వైశిష్ట్యంపై డాక్టర్ పిలకా శాంతమ్మ, 30న కాశీఖండం- గుణనిధి వృత్తాంతంపై పొందూరు సుధాకుమార్, 31న లలితా త్రిశతిపై భమిడిపాటి గౌరీశంకర్, 1న నాటకాస్త్రం సాహిత్యంపై ఎ.శ్రీరామమూర్తి, 2న అల్లసాని వారి అల్లిక జిగిబిగిపై వి.నాగేంద్ర, 3న కవికర్ణ రసాయనంపై డాక్టర్ బి.కోమలరావు, 4 ప్రబంధాల అవతరణ-ఎర్రన్న వైశిష్ట్యంపై నౌడూరు రామకృష్ణమూర్తి శర్మ, 5న కుచేలోపాఖ్యానం-స్నేహధర్మంపై పి.వి.ఎస్.సాయిప్రసాద్, 6న కరుణ శ్రీకారంపై జంధ్యాల శరత్‌బాబు ప్రవచనాలు చెబుతారని, సాహిత్యాభిమానులంతా పాల్గొనాలని కోరారు. 31న మహతి విశిష్ట సాహితీ పురస్కారాన్ని భమిడిపాటి గౌరీశంకర్‌కు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఏపీ జెన్‌కో ఎండీ



చక్రధర్‌బాబుకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎస్.చక్రధర్‌బాబు శుక్రవారం దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, అధికార సిబ్బంది గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ, అర్చకులు ఇప్పిలి షణ్ముఖశర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు పరిశీలన

కొత్తూరు: సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస గ్రామం ప్రాంతంలో రూ.32 వేల కోట్లతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు అంశం పరిశీలనలో ఉందని ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్‌బాబు తెలిపారు. కొత్తూరులో కోర్టు పనుల కోసం గురువారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు కోసం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. సుమారు రెండు వేల ఎకరాలు అవసరం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా రైల్వేలైన్ సౌకర్యంతో పాటు పలు రకాలు సదుపాయాలు ఉండాలన్నారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పైడి వేణుగోపాలం



పైడి వేణుగోపాలం

శ్రీకాకుళం న్యూకాలనీ: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు పైడి వేణుగోపాలం నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి పైడి వేణుగోపాలంకు రెండోసారి ఉపాధ్యక్ష పదవి వరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు పర్యాయాలు బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా సేవలందించారు. మూడు సార్లు శ్రీకాకుళం బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. న్యాయవాద వృత్తిలో విశేష సేవలు అందిస్తున్నారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ తరపున పోటీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

శివకుమార్‌కు స్వర్ణ పతకం



పతకంతో శివకుమార్

సోంపేట: నేషనల్ పవర్‌లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో సోంపేట పట్టణానికి చెందిన కాశి శివకుమార్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. జమ్షెడ్‌పూర్‌లో ఈ నెల 18 నుంచి 21 వరకు జాతీయ స్థాయిలో పోటీల్లో జూనియర్ కేటగిరిలో శివకుమార్ ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా శివకుమార్‌కు స్నేహితులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలియజేశారు.